క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా సామాజిక భవనం



ఇబ్రహీంపట్నం: జాకీర్‌హుస్సేన్ కళాశాల రోడ్డులో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభానికి సిద్ధమైంది. సచివాలయ కన్వీనర్ల కో ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు నిడుముక్కల శివశంకర రావు, జిల్లా ఐటీవింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోసు, యువ నాయకుడు పచ్చిగోళ్ల పండు, మేడ రాధ, తదితరులు తుదిదశ పనులను గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ భవన నిర్మాణానికి రూ.25 లక్షలను కేటాయించారు. భవన నిర్మాణం పూర్తికావడంతో ఫ్లోరింగ్, రంగులు, విద్యుత్, తదితర పనులు తుదిదశకు చేరాయి. త్వరలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

బోనాలు సమర్పణ



నూజివీడు: పోతురెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ అక్కినేని శ్రీదేవి నేతృత్వంలో మహిళలు గురువారం తిరుపతమ్మకు, యల్లమ్మ, ఉప్పలమ్మ దేవతలకు ఆషాఢమాస బోనాలను సమర్పించారు. మహిళలు గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి ఇంటి వద్ద తయారు చేసిన బోనాలను సమర్పించుకున్నారు. దీనిలో భాగంగా బోనాన్ని మట్టి పాత్రల్లో వండారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలులో పాల్గొన్నారు.

చాట్రాయిలో జగనన్న సురక్ష



చాట్రాయి: చాట్రాయిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గ్రామంలోని వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హత కలిగి ఏ సంక్షేమ పథకమూ రాని వారి వివరాలను సేకరిస్తున్నారు. సమస్యలు తెలుసుకుని తగిన ఆధారాలతో సమస్యను తీర్చనున్నారు. 11 రకాల సేవల్లో వారికి అవసరమైన వాటిని తెలుసుకుని యాప్‌లో డౌన్ లోడ్ చేసుకుని ఉచితంగా సేవలను పరిష్కరించనున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దామెర ప్రసాద్‌బాబు, దామెర బుచ్చిబాబు, సంకు సత్యనారాయణ, అంబటి రాంబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సాయి వ్రతాలు



తిరువూరు: స్థానిక శ్రీసత్యసాయి సేవాసమితి భజనమందిరంలో తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా గురువారం సామూహిక సాయి వ్రతాలు నిర్వహించారు. మందిర కమిటీ కన్వీనర్ దామెర ప్రభాకరరావు ఆధ్వర్యంలో పలువురు దంపతులు పీటలపై కూర్చుని సాయివ్రతాలు చేశారు. సత్యసాయిబాబాకు అష్టోత్తర శతనామాలతో విశేషార్చన అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పత్తి సాగుపై రైతులకు అవగాహన



నూజివీడు (ఆగిరిపల్లి): రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అందజేసి అధిక దిగుబడులు సాధించేలా చూడటమే తులసి సీడ్స్ లక్ష్యమని ఆ సంస్థ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో గురువారం నూజివీడు ప్రాంత సీడ్ ఆర్గనైజర్లు, రైతులకు పత్తి పంటపై అవగాహన కార్యక్రమాన్ని తులసి సీడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ మూడు దశాబ్దాల రైతన్నల నమ్మకం తులసి సీడ్స్ అన్నారు.

30 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, రైతులకు నాణ్యమైన పత్తివిత్తనాలను అందజేసి వారి నమ్మకాన్ని చూరగొన్నామన్నారు. కార్యక్రమంలో అత్యధిక దిగుబడులు సాధించిన నూజివీడు ప్రాంత పత్తి రైతులను తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, తులసి యోగీష్ చంద్ర, తులసి కృష్ణ చైతన్య శాలువాలు కప్పి సత్కరించి, ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో సీతారామయ్య, ఆర్గనైజర్లు అనంతనేని రాంబాబు, శంకర్రావు, రంగరాజు, ప్రసాద్, చిన్నశ్రీనివాస్ , రైతులు, తులసి సీడ్స్ ప్రొడక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్



ఇబ్రహీంపట్నంలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



తిరువూరు ఈద్గాలో ప్రార్థనలు

మైలవరం: పేదవాడి ఆకలి తీర్చడం బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని, త్యాగనిరతికి ప్రతీక అని ముస్లిం ముతవలిలు తెలిపారు. మైలవరంలో గురువారం బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. మైలవరంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ, ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాల్లో బక్రీద్ ఘనంగా జరిగింది. కొండపల్లిలో మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రాజా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మసీదులో మత గురువు మౌజన్‌బిల్లా, పరిసర ప్రాంత గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

తిరువూరు: మల్లమ్మ చెరువు సమీపంలోని ఈద్గా వద్ద జామియా మసీదు ఇమాం రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎ.కొండూరు: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మసీదుల ఇమాంలు పేర్కొన్నారు. చీమలపాడు, కృష్ణారావుపాలెం, కంభంపాడు, ఎ.కొండూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు గురువారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల ఇమాంలు మాట్లాడుతూ అల్లా దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం మహానీయులు వారి కుమారుడు హజరత్ ఇస్మాయిల్ మహానీయులు చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు. ఏఏఎంటీకే దర్బార్‌లో పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ ఆధ్వర్యంలో నిత్యాన్న కార్యక్రమాన్ని చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రసాదాన్ని స్వీకరించి మహమ్మద్ అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్యసమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్, పువ్వులు, గంధం సమర్పించి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఏ ఖాదర్ మొహియుద్దీన్, పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్, జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరు, గంపలగూడెం, పెనుగొలను, వినగడప, గోసవీడులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న ఈద్గాలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. మసీదులు, దర్గాల వద్ద ముస్లింలు ఉదయం నుంచే ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తిరువూరురూరల్: గానుగపాడు, ఆంజనేయపురం, వావిలాల, మునుకుళ్ల గ్రామాల్లోని మసీదులలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గానుగపాడు ఈద్గాలో మత గురువు హసన్ సాహెబ్ బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరించారు.

గురుకులాల్లో సీట్లు పెంచండి

మంత్రి మేరుగకు ఎమ్మెల్యే విజ్ఞప్తి

తిరువూరు: తిరువూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లు కేటాయించాలని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి.. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను కోరారు. గుంటూరు జిల్లా కొల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని తిరువూరు ఎమ్మెల్యే కలిసి గురుకులాల్లో సీట్ల పెంపు ఆవశ్యకత వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని తరగతుల్లో సీట్లు భర్తీ అయ్యాయని, ఇంకా ఎస్సీ విద్యార్థులు చేరడానికి ఎదురుచూస్తుండటంతో సీట్ల సంఖ్య పెంచాలని కోరారు.



సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఆదర్శ గ్రామంగా కొనసాగుతున్న జూపూడి గ్రామ పంచాయతీ మరో ముందడుగు వేసిందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు అన్నారు. ఢిల్లీకి చెందిన సాలిడ్, లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ మంత్రిత్వ శాఖ కన్సల్టెంట్ శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం జూపూడిలో జరిగిన శిక్షణ సదస్సులో డీపీవో టీవీ జయచంద్రగాంధీతో కలసి ఆయన పాల్గొన్నారు. ఘన, ద్రవ వ్యర్థాలు, తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణపై ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ తర్వాత గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల్లో వీరి సేవలు వినియోగిస్తామన్నారు.

గ్రామంలో ఖాళీ స్థలాల్లో గ్రామస్తుల పాడి పశువులతో డైరీ ఫారాలు ఏర్పాటు చేస్తామని, పాలు తీసుకునేందుకు పశువుల యజమానులు వస్తే సరిపోతుందని పోషణ బాధ్యత తామే తీసుకుంటామని శ్రీనివాస్ తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఎంపీడీవో రామకృష్ణ నాయక్, సర్పంచి కాకి దేవమాత, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, రామసీత తదితరులు పాల్గొన్నారు.



జూపూడిలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

మంచినీటి సమస్య పరిష్కారం

ముసునూరు: అన్నపనేనివారిగూడెంలో సర్పంచ్ ప్రోత్సాహం, ఉప సర్పంచ్ చొరవతో ఎట్టకేలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా ముసునూరు మండలం వేల్పుచర్ల శివారు అన్నపనేనివారిగూడెంలో 400 మంది ప్రజలు నివసిస్తున్నారు. గ్రామానికి మంచినీరు అందించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఆధీనంలోని 40 వేల లీటర్ల సామర్థ్యమున్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. దీనికి మెట్లు లేక పోవడంతో ఐదేళ్లలో పంచాయతీ సిబ్బంది ట్యాంకును శుభ్రపరచకుండానే మంచినీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. దీనిపై స్థానికుడు వైఎస్సార్ సీపీ నేత, ఉప సర్పంచ్ పటాపంచల శ్రీనివాసరావు సమస్యను సర్పంచ్ పుట్ల మోహనరావు దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన సర్పంచ్ సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో ఓవర్ హెడ్ ట్యాంకుకు నూతనంగా మెట్లు ఏర్పాటు, ట్యాంకుకు మరమ్మతులు చేయించి, రంగులు వేయించారు. సమస్యను పరిష్కరించిన ఉప సర్పంచ్, సర్పంచ్‌లకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.



అన్నపునేనివారిగూడెంలో మరమ్మతుల తర్వాత ఓవర్ హెడ్ ట్యాంక్

గణాంకశాస్త్రంతో దేశాభివృద్ధి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గణాంకశాస్త్రం ద్వారా దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయవచ్చని నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్) ఆర్.కిరణ్ కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, నేషనల్ స్టాట్‌స్టికల్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా గణాంక శాస్త్ర ప్రాముఖ్యతపై సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజ వికాసానికి, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయడానికి గణాంకాలు చాలా అవసరమన్నారు. ఆయా గణాంకాలను సేకరించటానికి వాటిని అధ్యయనం చేయటానికి, ఫలితాలను వివరించడానికి గణాంక శాస్త్రం చాలా ఉపకరిస్తుందన్నారు. గణాంకశాస్త్రంపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. గణాంకశాస్త్ర నిపుణులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గణాంకశాస్త్రంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. ఈ రంగానికి సంబంధించిన నిపుణుల కొరత ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. ఈ శాస్త్రంలో పట్టు సాధించటం ద్వారా అద్భుతమైన అవకాశాలను పొందవచ్చని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాలపై నిర్వహించిన పలు పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. స్టాటిస్టిక్స్ విభాగాధిపతి సీహెచ్ రాధిక, అధ్యాపకులు డాక్టర్ పి.శేషుబాబు, సిహెచ్ సౌజన్య, సురేఖ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కిరణ్‌కుమార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ మౌలానగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మౌలానగర్ ఏరియా, ఆంధ్ర హాస్పటల్ ఏరియా, వెంకయ్యనగర్ ఏరియా, అంబేద్కర్‌నగర్, టిలికం కాలనీ, మహాత్మా గాంధీ కమర్షియల్ కాంప్లెక్స్, వ్యవసాయ మార్కెట్ ఏరియా, వెంకటేష్ ఫౌండ్రి ఏరియా, ఎంకేఆర్ బిల్డింగ్ ఏరియా, బొగ్గు దొడ్డి, దర్గా దళితవాడ, సీఎం సెక్యూరిటీ ఆఫీస్ ఏరియా ఆయా సమయాల్లో కరెంట్ ఉండదని ఆయన వివరించారు.

సొసైటీ చైర్మన్లు, సీఈఓలకు సన్మానం

గంపలగూడెం: కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రుణాల రికవరీ విషయమై గంపలగూడెం మండలంలోని పది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నూరుశాతం వసూలు చేసినందుకు పాలకవర్గం చైర్మన్, సొసైటీ సీఈఓలకు పురస్కారం లభించింది. మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సంబంధిత 10 సొసైటీల చైర్మన్లకు సీఈఓలకు శాలువా కప్పి పురస్కరించారు. ఇదిలా ఉండగా సొసైటీలు ఏర్పడిన 45 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా చిన్న కొమిర, కనుమూరు సొసైటీల్లో నూరుశాతం రుణాలు రికవరీ కావడం విశేషం.

దత్తపీఠంలో సహస్ర మోదక హోమం

పటపట(విజయవాడతూర్పు): తొలి ఏకాదశి సందర్భంగా పటమట లోని గణపతి సచ్చిందనంద ఆశ్రమంలో సహస్ర మోదక హోమం జరిగింది. ఈ హోమాన్ని శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ (బాల స్వామీజీ) నిర్వహించారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడి పాడి పంటలు పుష్కలంగా ఉండాలని హోమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వినగడపలో గడప గడపకు మన ప్రభుత్వం

వినగడప(గంపలగూడెం):గంపలగూడెం మండలం వినగడప సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొని రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న ఇంటి పన్నుల గడువు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ పరిధిలో 2023 అర్ధ సంవత్సరం ఇంటి పన్నుల చెల్లింపునకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్ను బకాయిలు కొండపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయాల్లో పెనాల్టీ లేకుండా చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి జేవీవీ కృషి

తిరువూరు: సమాజంలో మూఢనమ్మకాలను పారదోలి ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కల్పించడానికి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక ఎస్ఆర్ టవర్స్ సెంటర్లోని జ్యోతి వైద్యశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో దీర్ఘకాలంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్ని చైతన్యపరుస్తున్న జేవీవీకి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. సభ్యత్వ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, సుదర్శన్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



తిరువూరు శివారు పీటీ కొత్తూరు రామాలయంలో విశేష పూజలు



శ్రీరంగనాయకస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం, తిరుమంజనం

తిరువూరు: తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి ఆలయంలో 11సార్లు విష్ణు సహస్ర నామపారాయణం, స్వామి పెరియాళ్వార్ తిరునక్షత్ర సందర్భంగా తిరుమంజనం కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా చేశారు. పీటీ కొత్తూరు రామాలయంలో సీతారామ చంద్రస్వామికి జరిగిన విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవేంకటాచలస్వామి ఆలయం, శ్రీషిర్డీసాయి మందిరాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు జరిగాయి.

గంపలగూడెం: గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో, నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో అఖండ హరే రామ నామ సంకీర్తన చేశారు. పేలాలపిండిని దేవతామూర్తులకు నైవేద్యంగా పెట్టి భక్తులకు పంచారు. తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు తెల్లవారుజామున ఇళ్ల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి విష్ణుమూర్తికి విశేష పూజలు చేశారు.



నెమలి ఆలయంలో అఖండ హరేరామ సంకీర్తన

క్రీడలతో ఉత్తమ భవిత

నూజివీడు: యువత క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక ధర్మఅప్పారావు కళాశాల ఆవరణలో జాదం రామచంద్రరావు మెమోరియల్ 8వ ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాలబాలికల బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలన్నారు. నూజివీడు ప్రాంతంలో జమిందారుల కాలం నుంచి క్రీడలకు ఆదరణ, ప్రోత్సాహం ఉండేదన్నారు. ప్రతి జట్టు కూడా విజయం కోసం పోరాడాలని, ఓడిపోయినా దాన్నే తొలిమెట్టుగా చేసుకుని మళ్లీ విజయం కోసం ఆడాలన్నారు. నేడు తల్లిదండ్రులు చదువుకు ఇచ్చినంత ప్రాధాన్యం క్రీడలకు ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం కూడా క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తోందని చెప్పారు. అనంతరం క్రీడాకారులను డీఎస్పీకి పరిచయం చేశారు. ఈ పోటీల్లో 13 బాలుర జట్లు, 11 బాలికల జట్లు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో తలపడుతున్నాయి. కార్యక్రమంలో డీఏఆర్ కళాశాల అధ్యక్షులు ఎంఎంఆర్‌వీ అప్పారావు, ఇంటెలిజెన్స్ అధికారి సింగంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్

జేసీఎస్ మండల ఇన్‌చార్జులు వీరే

మైలవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి జేసీఎస్ మండల ఇన్‌చార్జుల నియామక ఉత్తర్వులను గురువారం విడుదల చేశారు. మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు జేసీఎస్‌లను నియమించారు. మైలవరం మండలం చామల సీతారామిరెడ్డి, ఇబ్రహీంపట్నం మండలం కోనూరు వెంకటేష్, కొండపల్లి మున్సిపాలిటీకి లంకె అంకమోహనరావు, జి.కొండూరు మండలానికి కాజా బ్రహ్మయ్య, రెడ్డిగూడెం మండలానికి ఉయ్యూరు భరత్‌కుమార్ రెడ్డి, విజయావాడ రూరల్ మండలానికి గేరా సుమన్‌కుమార్ నియమితులయ్యారు.



గుడిపూడి నారాయణరావు



అనుమోలు బాలాజీ



ఏరువ ప్రకాష్‌రెడ్డి



దాసరి సతీష్



బాదినేని వీరబాబు

తిరువూరు నియోజకవర్గంలో..

తిరువూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. తిరువూరు రూరల్ మండలానికి గుడిపూడి నారాయణరావు, విస్సన్నపేట మండలానికి అనుమోలు బాలాజీ, తిరువూరు నగర పంచాయతీకి ఏరువ ప్రకాష్‌రెడ్డి, ఏకొండూరు మండలానికి దాసరి సతీష్, గంపలగూడెం మండలానికి బాదినేని వీరబాబు నియమితులయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):వాహన చోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పక ధరించాలని డాక్టర బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి.వసంతకుమార్ సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, షఫీవుల్లా, రఫీ, హేమంత్‌రావు, వి.విశ్వేశ్వరయ్య, రాజా రావు, రంగనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

ఇబ్రహీంపట్నం: గిరిజన ఆరాధ్యదైవం ఏకలవ్యుడి జయంతి వేడుకలు కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరిగాయి. కొండపల్లిలో ఏకలవ్యుని విగ్రహానికి వైఎస్సార్ సీపీ కొండపల్లి కన్వీనర్ మిక్కిలి శరభయ్య మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలసి నివాళులర్పించారు. ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, గిరిజన నాయకుడు మేడా రాధ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నేతలు ఎస్.శివశంకరరావు, ఎస్.ప్రసన్న బోసు, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.